# మిరపకాయ బజ్జీలు

ఆ చుట్టు ప్రక్కల దాదాపు ఇరవై ముఫై గ్రామాలలో పాలెం పచ్చిమిరపకాయలకు ప్రసిద్ధికాగా పాలెంలో వెంకమ్మ మిఠాయికొట్టు పచ్చిమిరపకాయ బజ్జీలకు ప్రసిద్ధి. పాలెంలో పచ్చిమిరపకాయలు విరివిగా పండుతాయి. వెంకమ్మ కొట్లో పచ్చిమిరపకాయ బజ్జీలు జాస్తిగా అమ్ముడు పోతాయి.

వెంకమ్మ భర్త కలరా వచ్చి పుష్కరం క్రింద చనిపోయాడు. అప్పట్లో బ్రతుకు తెరువు కోసం పునుగులూ, చక్రాలూ, గారెలూ, బజ్జీలూ తయారుచేసి, బుట్టలో పెట్టుకొని, ఇంటింటికీ తిరిగి అమ్ముకొంటూండేది. చిన్న వాన కాలువగా ప్రారంభించబడ్డ ఆ వ్యాపారం మూడేళ్ళలో బకింగ్‌హామ్ కెనాల్ అంత విస్తరించి, తన ఇంటిముందే ఓ పెట్టె కొట్టు పెట్టుకునేందుకు తగిన ప్రోత్సాహాన్ని కల్పించింది. ఊళ్ళోవాళ్ళు ఆమె వంటకాలలోని రుచికి మరిగి ఆమె కొట్టుకు చీమల బారులాగా రాసాగారు. అచిరకాలంలోనే ఆమె వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలవలె వృద్ధి చెందింది. మరో ఆయిదేళ్ళలో పెట్టె కొట్టును పక్క బిల్డింగ్‌లోకి మార్చింది.

ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క కళ అబ్బుతూ వుంటుంది. వెంకమ్మకు పచ్చిమిరపకాయ బజ్జీలు పసందుగా వండే కళ పట్టుబడింది. ఆ కళతో చిరుదిండి రాయళ్ళను ఆకర్షించి, వాళ్ళ నాలుకలపై లాలాజలపు ఊటను పెంచి, 'రోజూ అన్నం ఎట్లా

తింటామో మిరపకాయ బజ్జీలనుకూడా అట్లాగే తినాలి' అన్న అలవాటుకు బానిసలుగాచేసి, తనవ్యాపారానికి మహారాజ పోష కులుగా చేసుకుంది. విశేష మేమిటంటే ఊళ్ళో షావుకార్లుగా చలామణీ అవుతూన్నవాళ్లూ, పెద్దమనుషులుగా వ్యవహరించ బడుతూన్నవాళ్లూ, రాజకీయనాయకులుగా రాణిస్తూన్నవాళ్లూ ఆమె దుకాణపు గడప తొక్కటానికి నామూషీపడి, చాటుగా పొట్లాలకు పొట్లాలు మిరపకాయ బజ్జీలు తెప్పించుకొని తిని లొట్టలు వేసుకుంటూ వుంటారు.

అదృష్టం అందల మెక్కిస్తే 'సుబ్బి' 'సుబ్బలక్ష్మిగా' పేరు మార్చుకున్నట్టు వెంకమ్మ 'వెంకటలక్ష్మి మిఠాయి దుకాణం' అన్న బోర్డును అందంగా తయారు చేయించి, కొట్టుముందు వ్రేలాడ గట్టించింది. ఆమె వ్యాపార వైభవాన్ని చూసి, కన్ను కుట్టి, కడుపులో అసూయ ద్వేషాలు కదం తొక్కగా ఓ చిల్లర కొట్టు వర్తకుడు పోటీగా ఆమె దుకాణానికి సాక్షాత్తూ ఎదురు గానే 'బందరు మిఠాయి కొట్టు' అని ఓ షాపును ప్రారంభిం చాడు. అంతేకాకుండా ధరలు తగ్గించాడు. సరుకునాణ్యం పెంచాడు. వెంకమ్మ అణాకు రెండు బజ్జీలు అమ్ముతూండగా, పానకాలు మూడు బజ్జీలు అమ్మసాగాడు. ఆదెబ్బతో వెంకమ్మ కొట్టు బేరాలు వెనకచూపులు చూశాయి. కొత్తగా పెట్టిన పానకాల కొట్టుపై చిరుతిండి ప్రియులు ఎగబడసాగారు. కొత్తొక వింత పాతొకరోత అన్న సామెత వుండనే వుందిగా!

వరద తీసినట్టుగా చప్పగా తన కొట్టుబేరాలు జారిపోయే సరికి వెంకమ్మకు అంకిళ్ళు నొక్కుకు పోయాయి. బెండుపడి పోయింది. కాని ఆమెబుర్ర అనంతకోటి ఉపాయాలకు పుట్టిల్లు. ఆలోచించి ఆలోచించి ఓరోజు ఉదయాన కొట్టుపై 'కోవాబిళ్ల'

లాంటి తన కూతుర్ని కూర్చోపెట్టింది. వెంకమ్మకు సరళ ఒక్కతే కూతురు. అందాలబొమ్మ అపురూప లావణ్యవతి. మాంచి మిన్నతీవమీదున్నది. ఇంకా పెళ్ళి కాలేదు. ఆమెకు పెళ్ళి చేయాలని వెంకమ్మ మూడేళ్ళనుంచీ విశ్వప్రయత్నం చేస్తోంది. కాని కక్కూర్తా రాలేదు; కల్యాణమూ జరగలేదు. ఎన్నో సంబంధా లొచ్చాయి. కొన్ని కుదిరినట్లే కుదిరాయి. మరికొన్ని ముహూర్తాల వరకూ వెళ్ళాయి. కాని ఏదో ఒక వంకపై తొలిగిపోయాయి. రానురాను వెంకమ్మకు కూతురి పెళ్ళి చేయటం ఇసుకనుంచి తైలాన్ని తీయాల్సినంత కష్టంగా తోస్తోంది. ఆమె కడుపులో వుండ కడుతోన్న దిగులు అదే!

సరళ కొట్టుపై ఎక్కి కూర్చునేసరికి వాతావరణమే మారింది. నెమలి పింఛం విప్పుకున్నట్టుగా ఆకర్షణరెక్కలు విప్పుకున్నది. వెంకమ్మ వేసిన ఎత్తు అక్కరకొచ్చింది. నూనె సరుకంటే పడి చచ్చే బాపతంతా దారితప్పించిన గొర్రెల మూకవలె ఇటు మళ్లారు. ఎప్పుడూ వీధి మొహంచూడని షావుకారుగారి అబ్బాయి కూడా స్వయంగా వచ్చి ఓ పావలా పచ్చిమిరపకాయ బజ్జీలు పట్టు కెళ్లాడు. సరళ చేతిమీదుగా యిచ్చిన ఆ బజ్జీలు అతగాడికి అమృత ప్రాయంగా తోచాయి. కోడెవయస్సులో వున్న యువకులంతా ఆరోజు వెంకమ్మ దుకాణం వైపుకే ముక్కుకు త్రాళ్ళుపోసిన విధంగా లాగబడ్డారు. ఆ రోజు అమ్మకాన్ని చూసికొని వెంకమ్మ పున్నమి వెన్నెల పగిది నవ్వుకుంది.

అది మొదలుకొని సరళను రోజూ ఓ గంట సేపైనా విధిగా గల్లాపెట్టె దగ్గర కూర్చో బెడుతూన్నది వెంకమ్మ. ప్రత్యర్థి పానకాలు వ్యాపారం ఆరంభ శూరత్వమే అయింది. నూనె లేని దీపంవలె బేరం కాళ్లు బారజాపింది. అరువుకు ఒప్పుకున్నా, అమ్మ

కంలో అభివృద్ధి కనపడలేదు. వెంకమ్మ వ్యాపారదక్షత, గల్లా పెట్టె దగ్గర గోగుపువ్వులాంటి కూతుర్ని కూర్చోబెట్టటంలోనే వుందని పసిగట్టాడు పానకాలు. కాని తనకలాంటి అందమైన కూతురు లేదు. భార్యను కూర్చోబెడదామన్నా—కారుబెల్లపు జిలేబిలా గుంటుంది. ఈ పాటి అమ్మకం కూడా అడుగంటి పోతుంది. ఏం చేయాలో తోచక పానకాలుకు నిలువుగుడ్లు పడిపోయాయి. కాని తను చేయగలిగింది చేయడానికి గట్టిగా నిర్ణయించుకున్నాడు. అసూయా ద్వేషాలు వ్యాపారానికి చెద పురుగుల్లాంటివి.

*　　　　*　　　　*

వారం రోజుల క్రితమే లంకనుంచి ఓ మంచి సంబంధం వొచ్చింది వెంకమ్మ కూతురుకు. పెళ్లి చూపులుకూడా జరిగాయి. పిల్ల అందచందాలకు వాళ్ళు నిలువెల్లా పరవశత్వాన్ని పొందారు. ఇంటికి వెళ్లి లగ్నాలకు మంచిరోజు చూసి వ్రాస్తామన్నారు. ఆ సంబంధం ఖాయ మవుతుందని వెంకమ్మ కొండంత ఆశపడింది. కాని ఆ ఆశ కొండ ఎక్కనే ఎక్కింది. లంకనుంచి ఉత్తరం వచ్చింది. 'పిల్ల ప్రవర్తనను గురించి మాకు చెడు వార్తలు అందాయి. ఈ సంబంధాన్ని వొదులుకుంటున్నాము.'

ఎరురు రొమ్ములో గడ్డపలుగు దిగవేసినట్లయింది వెంకమ్మకు. మొద్దు బారిన మనస్సు మూడు గంటలవరకూ మేల్కోలేదు.

...దీనికంతకీ కారణం ఆ రౌడీ వెధవ వెంకటపతే! వాడు ముప్పొద్దులూ మిరపకాయ బజ్జీలు తింటూ ఈ కొట్టుదగ్గరే పెంపుడు కుక్కలా పడి చస్తాడు. నడివయస్సులో ఉన్నాడు. అందమూ, అహమూ జాస్తిగా ఉన్నాయి. అన్ని వ్యసనాలనూ అలవర్చు కున్నాడు. తన ప్రవర్తన ద్వారా ఇతర్లలో భయం

రేకెత్తించి, సుఖంగా బ్రతకటానికి అలవాటు పడ్డాడు. మనిషి రక్తం కళ్లజూడటమంటే—దప్పిక గొన్నప్పుడు మంచినీళ్ళను కళ్ళజూడటమే! ఊళ్ళో వారికి షావుకారు చెంగయ్య అండ ఉంది. ఏ దుర్మార్గం చేసినా ఏ దోపిడీ చేయించినా, ఏ ఇల్లాలి శీలాన్ని చెడగొట్టినా, ఏ అవినీతికి పాల్పడ్డా—అండబలమూ, అధికారుల మద్దతూ ఉన్నాయి. వాడ్ని చూస్తే ఊరంతా చలి జ్వర మొచ్చినట్టు వొణికి పోవడంలో విడ్డూర మేముంది?... వాడికీ తన కూతురికీ అక్రమ సంబంధాలు కట్టి ఆడిపోసుకోవడం అన్యాయం! అంతకంటే దారుణమైన ఆరడి మరొహటుంటుందా? వాడెప్పుడూ తన కొట్టుదగ్గరే వుంటూండవచ్చు: సరళతో తరచూ మాట్లాడుతూండవచ్చు; తనకొట్టుకు మద్దతుగా అండగా వ్యవహరిస్తూ ఉండవచ్చు. వాడివల్లనే తనకు రావాల్సిన బాకీలు ముద్దరసుద్దిగా వస్తూండవచ్చు! తనని ఎవ్వరూ చులకనగా చూడ టానికి ధైర్యం చేయకపోవచ్చు. అంతమాత్రంచేత అభమూ శుభమూ తెలియని తన కూతురికీ ఆ పోకిరి వెధవకూ సంబంధం కట్టి దాని బ్రతుకులో ఆరని నిప్పులు పోయటమా?...ఈ దుమారాన్నీ అపనిందనూ తనంటే గిట్టనివాళ్ళే తన అంశ రాసి అసూయతో కళ్ళు పచ్చ చేసికున్నవాళ్ళే లేవదీసి వుంటారు. ముఖ్యంగా ఆ పానకాలుగాడి పనై వుంటుంది...

తన కర్తవ్యమేమిటి? తను పిల్లకు పెళ్ళి చేయలేదా?... ఎన్ని సంబంధాల్ని వెతికి తెచ్చిందీ తను? కాని ఒక్కటీ కొస వరకూ సానుకూల పడలేదు. కారణం ఎవరో ఒకరు పని గట్టు కొని చెడగొట్టటమే! తను సరళ పెళ్ళి చేయాలంటే రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి—ఈ వూరునుంచి తను లేచి పోయి దూరంగా ఎక్కడికేనా వెళ్ళి స్థిరపడాలి. అక్కడ సరళ

పెళ్ళి చేయాలి. రెండోది వెంకటపతిని కొట్టు చాయలకు రాకుండా కట్టుదిట్టం చేయాలి. ఈ రెండు మార్గాలలో ఏది ఆచరణ సాధ్యం? మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగుతోన్న వ్యాపారాన్ని వొదిలి మరోచోటికు తను వెళ్ళలేదు. అథవా వెళ్ళినా పరిస్థితు లెట్లా పరిణమిస్తాయో!... వెంకటపతిని కొట్టు చాయలకు రాకుండా చేయడంకూడా తనకు వీలుమాలిన పనే! అతగాడికి ఆగ్రహం వచ్చిందంటే - పట్టపగలు పన్నెండు గంటల వేళలోనైనా ఓ డబ్బా కిరసనాయలు పోసి, అగ్గిపుల్ల గీసి అంటించగలడు. తను నాశనంకాక తప్పదు. ఏమైనా అతి నేర్పుతో, చాకచక్యంగా, రెండోకంటి కనురెప్ప కదలకుండా- వాడి పీకను తప్పించాలి. తనకి అడ్డూ తొలగిపోతుంది. ఊరివారికి బెడదా సమసిపోతుంది. ఒక పాపం చేసినా—రెండు మంచి పనులు జరుగుతాయి!

ఆ విధంగా వెంకమ్మ దృఢమైన నిర్ణయాని కొచ్చింది. ఆ పనికూడా తనవల్లతప్ప ఎవ్వరివల్లకూడా కాదనే అనుకుంది. ఆవిడకు మంచిగానీ, చెడుగానీ ఆత్మ విశ్వాసం మెండు.

రోజూ వెంకటపతి ఆ కొట్టుకు రెండు సార్లయినా వస్తూ వుంటాడు. మధ్యాహ్నం రాకపోయినా సాయంత్రంపూట మట్టుకు తప్పకుండా వస్తాడు. ఓ డజను మిరపకాయ బజ్జీలు లేనిదే కాపుసారా గొంతులోకి జారదు. అందుచేత వాటికోసం విధిగా వస్తాడు.

ఆ సాయంత్రం వెంకమ్మ ఓ డజను మిరపకాయ బజ్జీలు ప్రత్యేకంగా తయారుచేసి ఎర్రటి కాగితంలో పొట్లాంకట్టి, గోడకు వేసిన దేవునిపటం వెనుక భద్రంగా దాచింది రెండో కనురెప్ప కానకుండా.

సూర్యుడు పశ్చిమ దిశను కాగడా చేతపట్టుకొని సవారీ చేస్తుండగా, మామూలు వేళకు వెంకటపతి దుకాణానికి వచ్చాడు. అతని రాకకోసం కళ్ళల్లో కొవ్వొత్తుల్ని వెలిగించుకొని ఎదురు చూస్తోన్న వెంకమ్మకు, తీరా అతను రాగానే భయంతో వొణికిపోయింది.

"ఎంకమ్మోయ్! ఇహ రేపట్నుంచి నేను తీరిగ్గా ఇట్టా నీ కొట్టుకు రావడం పడదు. ఎవడిచేతనైనా కబురుచేస్తే బజ్జీలు పంపు" అన్నాడు వెంకటపతి చేతికర్రను గోడకు ఆనించి బల్లపై కూర్చుంటూ.

"ఏమిటి గిరాకీ?" అన్నది వెంకమ్మ.

"మా షావుకారుగారి పెద్దబ్బాయికి పెళ్ళి కుదిరింది. లగ్నాలు పెట్టుకుంటున్నారు. ఇహ నాకు చేతినిండా పనే!" అన్నాడు వెంకటపతి కుచ్చుమీసాన్ని సగర్వంగా సరిజేసుకుంటూ.

వెంకమ్మ మనస్సులో మెటికెలు విరిచింది. కాని అంతలోనే ముక్కుపుటాలపై దుఃఖాన్ని దొర్లించింది; కనురెప్పల కొనలపై కన్నీటి బిందువుల్ని రప్పించింది, గొంతులో శోకాన్ని సాగ దీసింది.

"...మళ్ళీ మా సరళ పెళ్లి తప్పిపోయింది. ఎవరో గిట్టని వాళ్ళు పనిగట్టుకొని వెళ్లి చెవులుకొరికి వచ్చారు. మా రోజులు బావుండలేదు."

"దిగులుపడకు వెంకమ్మా! రేపు మద్దేనెలకు మంచిసంబంధం వెతుక్కొచ్చి మూడోనాటి మాపిటాలకు నీ కూతురి పెళ్ళి చేయనూ! నేను తల్చుకుంటే ఈ లోకంలో కానిపనేముంది?" అన్నాడు. వెంకటపతి మొహంపై అహంకారపు చిరునవ్వు చాటంతకాగా.

"కాని, నీకు దాపురించే చావును నువ్వు ఆపలేవు" అనుకుంది వెంకమ్మ కసిగా.

సూర్యుడు సాంతం నిష్క్రమించాడు. పాపాత్ముని మనస్సు లోని భయంవలె చీకటి చుట్టుముట్టింది.

దేవుని పటంవెనుక ప్రత్యేకంగా దాచిపెట్టిన మిరపకాయ బజ్జీల ఎర్ర కాగితపు పొట్లాన్ని వెంకటపతి చేతికిచ్చింది వెంకమ్మ. ఆ పొట్లాం తీసికొని ఈలలు వేసుకుంటూ వెళ్ళాడు వెంకటపతి.

"ఈ ఎచ్చులెంతసేపు? మళ్ళీ నీ బ్రతుకులో ప్రొద్దు పొడిస్తేగా?" అనుకుంది వెంకమ్మ పెదవులు బిగబట్టి.

* * *

ఆ రాత్రి వెంకమ్మకు కంటిపై కునుకు లేదు. తెల్లవార్లూ ఆలోచిస్తూనేవుంది. ఏవేవో భయాలూ, పిచ్చిపిచ్చి ఆలోచనలూ, ఆవేదనలూ!—తెల్లవారుఝామున ఎప్పుడో కాస్త కనురెప్పలు వాలాయి.

మళ్ళీ ప్రొద్దువిచ్చుకోకముందే మెలకువ వచ్చింది వెంకమ్మకు. ఇంట్లో ఏం అలికిడి లేదు. ఇంకా సరళ నిద్రనుంచి లేవలేదా? అనుకుంటూ పడమటి గదిలోకి వెళ్ళింది.

సరళ మంచంపై పడుకొని ఉంది. ఆమెపై ఈగలు ముసిరి ఉన్నాయి. తట్టి లేపడానికి ప్రయత్నించింది.

వెంకమ్మ గావుకేక పెట్టింది.

ఇల్లుకూలి మీద పడినట్లయింది.

మంచంలో సరళ అచేతనంగా పడి ఉంది.

ఆ మంచంపైనే ఒక చీటీ వ్రాసి పెట్టబడింది.

"నన్ను క్షమించమ్మా! నేను ఈ లోకాన్ని విడిచి పోతున్నాను. పరిస్థితులట్లా పగబట్టి నా చేత ఈ పని చేయించాయి.

నేను షావుకారుగారి అబ్బాయి గోపాలాన్ని గాఢంగా ప్రేమించాను. అతనూ అంత గాఢంగా ప్రేమించినట్టు నటించి నా సర్వస్వాన్నీ హరించి, నన్ను మోసగించాడు. నన్ను పెళ్ళి చేసుకుంటానని వాగ్దానం చేసి ఎక్కువ కట్నం వస్తూన్నదన్న ఆశతో ఇప్పుడు ఎవర్నో పెళ్ళి జేసికుంటున్నాడు. ఇహ నా జీవితంలో మిగిలింది కారుచీకట్లు క్రమ్ముకున్న భవిష్యత్తే! నన్ను 'కర్మకు' వొదిలేసి అతనొక్కడే భౌతిక సుఖాన్ని అనుభవించ డాన్ని నేను సహించలేను! అందుకే ఈ దారుణానికి పాల్ప డ్డాను. మేం రహస్యంగా రోజూ పెరటిదొడ్లో కల్సుకొంటూ వుండేవాళ్ళం. రాత్రికూడా గోపాలం వచ్చాడు. నువ్వు వెంకటపతిని హతమార్చాలని విషంకలిపి ప్రత్యేకంగా తయారు చేసిన మిరపకాయ బజ్జీలను మేము తిన్నాం. గోపాలం ప్రేమ లోని స్వార్థాన్ని ఇప్పుడు తెలుసుకున్నాను. ఆ స్వార్థానికి ప్రతీకారంగా ఈ పాపానికి తలపడ్డాను. నన్ను క్షమించమ్మా!

—సరళ"

*　　*　　*

తర్వాత కొద్ది రోజులకే వెంకమ్మ మిఠాయి దుకాణం మూతబడ్డది.

ఇప్పుడు పాలెం పచ్చి మిరపకాయల బజ్జీలకు ప్రసిద్ధి కాదు.

(జయశ్రీ)